సాక్షి
పెద్దపల్లి
సోమవారం । 30 । జూన్ । 2025

కిరాత వారాహిదేవిగా అమ్మవారు

సుల్తానాబాద్: మండల కేంద్రంలోని సాంబశివాలయంలో నిర్వహిస్తున్న శ్రీవారాహి దేవి గుప్త నవరాత్రుల్లో భాగంగా ఆదివారం అమ్మవారు కిరాత వారాహిదేవి అవతారంలో దర్శనమిచ్చారు. అమ్మవారికి మంగళహారతి, కుంభహారతి, కుష్మాండ, దీపం నైవేద్యం, చెక్కర పొంగలి, కుంకుమ, పువ్వు, పాలు పండ్లు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.



న్యూస్‌రీల్

సుల్తానాబాద్‌కు అదనపు జూనియర్ సివిల్ కోర్టు

సుల్తానాబాద్: సుల్తానాబాద్‌కు అదనపు జూనియర్ సివిల్ కం అదనపు జ్యూడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టును ప్రభుత్వం మంజూరు చేసింది. ఈమేరకు ఈనెల 27న ప్రభుత్వ న్యాయశాఖ కార్యదర్శి రేండ్ల తిరుపతి ఉత్తర్వులు జారీ చేశారు. అదనపు కోర్టు మంజూరుకు కృషి చేసిన మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే విజయరమణరావులకు బార్ అసోసియేషన్ కృతజ్ఞతలు తెలిపింది.

బోనాల జాతర



బోనాలతో వస్తున్న ఎమ్మెల్యే సతీమణి

గోదావరిఖని: ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం మైసమ్మ బోనాల జాతర ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే సతీమణి మనాలీఠాగూర్ నెత్తిపై బోనం ఎత్తుకొని డప్పు చప్పుళ్లతో క్యాంపు కార్యాలయం ఎదురుగా ఉన్న మైసమ్మ ఆలయం వద్దకు వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మైసమ్మకు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బొంతల రాజేశ్, గుండేటి రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

'ఖని' నుంచి అరుణాచలంకు ఆర్టీసీ ప్రత్యేక బస్సు

గోదావరిఖనిటౌన్: గురుపౌర్ణమి సందర్భంగా అరుణాచలంకు ప్రత్యేక రాజధాని ఏసీ బస్ సౌకర్యం కల్పిస్తున్నట్లు గోదావరిఖని ఆర్టీసీ డిపో మేనేజర్ ఎం.నాగభూషణం తెలిపారు. బస్సు జూలై 8న గోదావరిఖని నుంచి మధ్యాహ్నం 3 గంటలకు బయలు దేరి కాణిపాకం, వెల్లూరు గోల్డెన్‌టెంపుల్ దర్శనం అనంతరం అరుణాచలం చేరుకుంటుందని అన్నారు. 10న గురుపౌర్ణమి రోజు అరుణాచలం గిరి ప్రదక్షిణ అనంతరం తిరుగు ప్రయాణంలో జోగులాంబ శక్తిపీఠం దర్శనం ఉంటుందని తెలిపారు. టికెట్ ధర అప్ అండ్ డౌన్ కలిపి ఒకరికి కేవలం రూ.5,900గా నిర్ణయించామన్నారు. ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. పూర్తి వివరాలకు 7013504982, 7382847427 నంబర్లలో సంప్రదించాలని డీఎం కోరారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

పెద్దపల్లిరూరల్: ఉపాధ్యాయ, ఉద్యోగ పెన్షన్ల పెండింగ్ బిల్లులు చెల్లించాలని తెలంగాణ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర నాయకుడు రమేశ్ డిమాండ్ చేశారు. పెద్దపల్లిలోని సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాలలో ఆదివారం నిర్వహించిన జిల్లాశాఖ సమావేశంలో మాట్లాడారు. పీఆర్‌సీ నివేదికలను బట్టి కొత్త పీఆర్‌సీ అమలు చేయాలన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయులకు హెల్త్‌కార్డులు అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు సునీల్ రెడ్డి, శ్రీనివాసరావు, కనకయ్య, అంజయ్య, వీరస్వామి, వెంకటేశ్వర్లు, అనిల్, ప్రసాద్, సురేందర్ పాల్గొన్నారు.

మొబైల్ పంక్చర్ వాహనం



మొబైల్‌పంక్చర్ సర్వీస్‌తో టైర్‌కు పంక్చర్ వేస్తున్న మాజిద్

మంథనిరూరల్: సాంకేతిక పరిజ్ఞానం పెరిగిన నేపథ్యంలో మొబైల్ బిజినెస్‌లు పెరిగిపోయాయి. మొబైల్ ఫోన్‌లో ఆర్డర్ పెడితే చాలు క్షణాల్లో ఇంటి గుమ్మం ముందు ఉంటుంది. ఈక్రమంలోనే మంథనికి చెందిన మాజిద్ ఏకంగా మొబైల్‌పంక్చర్ సర్వీస్ ప్రారంభించాడు. ఓ చిన్న ట్రాలీ ఆటోలో ఏర్ ట్యాంకును ఏర్పాటు చేసుకుని పంక్చర్‌సామగ్రితో పల్లెల్లో తిరుగుతున్నాడు. ఎక్కడైనా వాహనం పంక్చర్ అయితే అక్కడికి వెళ్లి పంక్చర్ చేస్తున్నాడు. మంథని మండలం వెంకటాపూర్‌లో ఓ ట్రాక్టర్ టైర్‌కు మొబైల్‌పంక్చర్ వాహనంతో పంక్చర్ వేస్తుండగా 'సాక్షి' కెమెరా క్లిక్ మనిపించింది.

జిల్లా కేంద్రం.. మారని తీరు



కమాన్ చౌరస్తా



ఆర్టీసీ బస్టాండ్



జెండా చౌరస్తా



అమర్‌నగర్ చౌరస్తా



ప్రగతినగర్ చౌరస్తా



బస్టాండ్ చౌరస్తా



అయ్యప్పగుడి చౌరస్తా

దశాబ్దాలుగా అభివృద్ధికి నోచుకోని ప్రధాన కూడళ్లు.. ప్రగతి కనిపించని ఆర్టీసీ బస్టాండ్.. అదే కమాన్ చౌరస్తా.. వ్యాపార కూడలి జెండా చౌరస్తా.. పెద్దపల్లి జిల్లాగా ఆవిర్భవించి సుమారు తొమ్మిదేళ్లు గడుస్తున్నా పట్టణ రూపురేఖలు మారలేదు. పెద్దపల్లి జిల్లాగా ఆవిర్భవించిందని ప్రజలు హర్షాతిరేకాలు వ్యక్తంచేసినా.. మౌలిక వసతులు, అభివృద్ధి, కూడళ్ల సుందరీకరణకు నోచుకోవడం లేదు. పదవుల కోసం పాకులాటలు తప్ప రాజకీయ నాయకులు అభివృద్ధి వైపు దృష్టి సారించడం లేదనే విమర్శలు ఉన్నాయి. ఇందుకు నిదర్శనమే పెద్దపల్లిలోని ప్రధాన చౌరస్తాల దుస్థితి ఇది.

– సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

స్కానింగ్ కేంద్రాల ఇష్టారాజ్యం

- విచ్చలవిడిగా గర్భస్రావాలు
- తనిఖీలు నిర్వహిస్తున్నా మారని తీరు

- పెద్దపల్లి మండలం భోజన్నపేటకు చెందిన వివాహిత గర్భస్రావం కోసం ఇటీవల మెడికల్ షాపు నుంచి తెచ్చుకున్న మాత్రలు మింగింది. తీవ్ర రక్తస్రావమై మరణించింది. అప్పటికే ముగ్గురు పిల్లలున్న ఆ యువతి.. కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకోలేదు. దీంతో ఆమె మళ్లీ గర్భం దాల్చింది. ఆర్థిక పరిస్థితి అంతంతగానే ఉండడంతో గర్భస్రావం కోసం ట్యాబ్లెట్లు మింగింది. దీనిపై పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది.

- గోదావరిఖనిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రి స్కానింగ్ సెంటర్‌లో రికార్డులు నిర్వహించడం లేదు. ఇష్టానుసారంగా స్కానింగ్ చేస్తున్నట్లు డీఎంహెచ్‌వో తనిఖీల్లో వెలుగు చూసింది.

- స్కానింగ్ కోసం వెళ్లేవారి వివరాలను రికార్డులో నమోదు చేయని కారణంగా ధర్మారంలోని ఓ స్కానింగ్ సెంటర్‌ను డీఎంహెచ్‌వో ఇటీవల సీజ్ చేశారు.



గోదావరిఖనిలో స్కానింగ్ సెంటర్లను తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో అన్నప్రసన్న కుమారి (ఫైల్)

పెద్దపల్లిరూరల్: జిల్లాలో గర్భస్థశిశు నిర్ధారణ దందా యథేచ్ఛగా సాగుతోంది. చట్టాలు, నిబంధనల ప్రకారం వ్యవహరించాలనే అధికారుల సూచనలను పట్టించుకోవడంలేదు. కొందరు స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.

150 ఆస్పత్రులు.. 32 స్కానింగ్ సెంటర్లు..

జిల్లాలో దాదాపు 150 వరకు ప్రైవేట్ ఆస్పత్రులు ఉన్నాయి. 32 స్కానింగ్ సెంటర్లు పనిచేస్తున్నట్లు అధికారుల రికార్డులు చెబుతున్నాయి. ఈ కేంద్రాల్లో ఎన్ని పరీక్షలు చేశారు, కారణాలు ఏమిటనే వివరాలను నమోదు చేయాలి. నెలకోసారి డీఎంహెచ్‌వో కార్యాలయంలో నివేదిక అందజేయాలి. గైనకాలజిస్టులు ఉన్న ఆస్పత్రులతో పాటు డయాగ్నొస్టిక్ సెంటర్లలో వీటిని ఏర్పాటు చేశారు. అయితే, గర్భిణుల కుటుంబీకులు కొందరు.. కడుపులోని పిండం ఆడనా, మగనా? అనే విషయాన్ని తెలుసుకునేందుకు స్కానింగ్ సెంటర్లను ఆశ్రయిస్తున్నారు. దీనిని ఆసరాగా చేసుకున్న కొందరు స్కానింగ్ సెంటర్ నిర్వాహకులు వైద్యులు రెఫర్ చేయకున్నా స్కానింగ్ చేస్తూ అధిక మొత్తంలో వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

మెడికల్ 'దందా'

ప్రైవేట్ ఆస్పత్రులు, నర్సింగ్‌హోంలకు అనుబంధంగా ఏర్పాటు చేసిన యాజమాన్యాలు మెడికల్ దందా సాగిస్తున్నాయి. ఆస్పత్రిలో వైద్యసేవలు పొందితే దాని అనుబంధ మెడికల్ షాపులోనే మందులు కొనుగోలు చేయాలనే నిబంధన అమలు చేస్తున్నారు. గర్భస్రావం మాత్రలు, సూదిమందులను ప్రిస్క్రిప్షన్ ఉంటేనే ఇవ్వాలి. కానీ, అవేమీ పట్టించుకోవడం లేదనే ఫిర్యాదులు ఉన్నాయి. మెడికల్ షాపుల వాళ్లే గర్భస్రావం మాత్రలను ఆర్ఎంపీలకు ఇస్తూ ఎక్కువ మొత్తం వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. కొన్ని సందర్భాల్లో గర్భస్రావం మాత్రలు మింగి ప్రాణాలమీదికి తెచ్చుకుంటున్నా.. ఇలాంటి ఘటనలను కప్పిపుచ్చుతున్నట్లు తెలిసింది.

లింగనిర్ధారణ చట్టవిరుద్ధం

గర్భస్థ శిశువు లింగ నిర్ధారణ, గర్భస్రావాలు చేసే వారిపై పీసీ పీఎన్‌డీటీ(ప్రీ కాన్సెప్షన్ అండ్ ప్రీనాటల్ డయాగ్నొస్టిక్స్ చట్టం–1994) ప్రకారం శిక్షార్హులు. ఈచట్టం ప్రకారం కనీసం మూడేళ్లజైలు, రూ.10వేల జరిమానా విధించే అవకాశం ఉందని అధికారులు పేర్కొంటున్నారు. మరోవైపు.. డీఎంహెచ్‌వో అధ్యక్షతన రెడ్‌క్రాస్ సొసైటీ, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు, గైనకాలజిస్టులతో సమావేశమై లింగనిర్ధారణ వ్యతిరేక చట్టంపై అవగాహన కల్పిస్తున్నారు.

విచ్చలవిడిగా గర్భస్రావాలు

లింగ నిర్ధారణ చేశాక ఆడపిల్ల అని తెలిస్తే స్థానికంగా ఉన్న ఆర్ఎంపీల సాయంతో గర్భస్రావాలు చేయిస్తున్నారు. వాస్తవానికి కడుపులో శిశువు మృతి చెందడం, ఇతర సమస్య ఉన్నట్లు స్కానింగ్‌లో తేలితే అర్హులైన వైద్యుల సమక్షంలో గర్భస్రావం చేయాలి. కానీ ఆర్ఎంపీల సాయంతో స్కానింగ్ కేంద్రాల్లో ఇష్టానుసారంగా గర్భస్రావాలు చేస్తున్నారు. గర్భస్రావం చేసుకోలేని వారికి ఆర్ఎంపీలే గర్భవతి నెలలను బట్టి మాత్రలు ఇస్తూ నెలకు ఇంత అని వసూలు చేస్తున్నట్లు సమాచారం.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



స్కానింగ్ కేంద్రాలు, ప్రైవేట్ ఆస్పత్రులు, మెడికల్ షాపుల నిర్వాహకులు నిబంధనలకు లోబడే వ్యవహరించాలి. ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు. నిబంధనలు పాటించని వాటిని గుర్తించి ఆధారాలతో మా దృష్టికి తీసుకొస్తే సత్వరమే స్పందిస్తాం.

– అన్నప్రసన్నకుమారి, డీఎంహెచ్‌వో

'స్థానిక' పోరులో మనమే గెలవాలి

- ప్రభుత్వ పథకాలపై ప్రచారం చేయండి
- కాంగ్రెస్ పార్టీ పరిశీలకులు సంగీతం శ్రీనివాస్



మాట్లాడుతున్న సంగీతం శ్రీనివాస్

పెద్దపల్లిరూరల్: స్థానిక సంస్థలకు జరుగనున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులే విజయం సాధించాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ పరిశీలకులు సంగీతం శ్రీనివాస్, అజ్మతుల్లాఖాన్ అన్నారు. ఆదివారం పెద్దపల్లిలో ఎమ్మెల్యే విజయరమణారావు అధ్యక్షతన జరిగిన కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గస్థాయి సమావేశంలో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి పనిచేస్తోందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల ఫలాలను విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ఎమ్మెల్యే విజయరమణారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలాలను అర్హులైన వారందరికీ అందేలా చూడాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలదేనని అన్నారు. పార్టీ కోసం పనిచేసే నాయకులను గుర్తించి తగిన ప్రాతినిధ్యం కల్పిస్తామని తెలిపారు. రానున్న స్థానిక సమరంలో పోరాడి విజయం సాధించే నాయకులకే అవకాశం కల్పిస్తామని స్పష్టం చేశారు. ఎన్నికల్లో గెలుపే ముఖ్యమని అందుకు పార్టీనేతలంతా సమిష్టిగా పనిచేయాలని సూచించారు.

విజ్జన్నకు మంత్రి పదవి ఇవ్వాలి

పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావుకు మంత్రిమండలిలో స్థానం కల్పించాలని నాయకులు మహేందర్, అన్నయ్యగౌడ్, ప్రేంసాగర్‌రావు తదితరులు కోరారు. రెండోసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన విజయరమణారావు ప్రజానాయకుడని అన్నారు. సమావేశంలో మార్కెట్‌కమిటీ చైర్మన్లు ఈర్ల స్వరూప, ప్రకాశ్‌రావు, సంజీవ్‌లతో పాటు నాయకులు మల్లన్న, రామ్మూర్తి, అవినాష్, ఆరె సంతోష్, సంతోష్, సురేశ్‌గౌడ్, తిరుపతిరెడ్డి, నర్సింహరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ.200 కోట్లతో అభివృద్ధి పనులు

- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు



ఓదెలలో రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

ఓదెల: సీఎం రేవంత్‌రెడ్డి మంజూరు చేసిన రూ.200 కోట్లతో నియోజకవర్గంలో చురుకుగా అభివృద్ధి పనులు జరుగుతున్నాయని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. ఆదివారం ఓదెలలో కల్యాణలక్ష్మి, రేషన్‌కార్డులను పంపిణీ చేసి మాట్లాడారు. రిటైర్డ్ సింగరేణి కార్మికులతో పాటు అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు పంపిణీ చేయాలని అధికారులను ఆదేశించారు. రూపునారాయణపేట మానేరుపై మూడు జిల్లాల వారధికి రూ.80 కోట్లతో పనుల ప్రారంభానికి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. మంచినీటి పైపులైన్లు పూర్తి చేసి ఓదెలకు మంచినీటి ఎద్దడి లేకుండా చేస్తామన్నారు. విజ్జన్న ఎమ్మెల్యేగా ఉన్నన్ని రోజులు రైతులకు ఢోకాలేదని తెలిపారు. ఓదెలలో ఓదెల, కాల్వశ్రీరాంపూర్ రెండు మండలాలకు సబ్‌కోర్టు త్వరలో ప్రారంభమవుతుందని అన్నారు. కోర్టుకు పక్కాభవనం నిర్మిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓదెల తహసీల్దార్ ధీరజ్‌కుమార్, పొత్కపల్లి సింగిల్ విండో చైర్మన్ సుమన్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రేంసాగర్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రాహుల్‌గౌడ్ పాల్గొన్నారు.

పనులు నాణ్యతతో వేగంగా పూర్తిచేయాలి



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: పనులు నాణ్యతతో వేగంగా పూర్తి చేయాలని రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్ ఠాకూర్ అన్నారు. రోజువారీ మార్కెట్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆదివారం పరిశీలించారు. శివాజీనగర్ డైలీమార్కెట్ పురోగతి తెలుసుకున్నారు. టీయూఎఫ్ఐడీసీ ద్వారా మంజూరైన రూ.2.50 కోట్లతో చేపట్టిన పనుల తీరును సమీక్షించారు. ఈనిధులతో రోడ్లు, డ్రైనేజీ, షెడ్ల నిర్మాణం జరుగుతోందన్నారు. ఎమ్మెల్యే వెంట నాయకులు మహంకాళిస్వామి, బొంతల రాజేశ్ తదితరులున్నారు.

భారీ హనుమాన్ విగ్రహ పనుల పరిశీలన

రామగుండం: రామగుండం బైపాస్ రోడ్డు ఎదుట శ్రీరామునిగుండాల కొండపై గల శ్రీధన్వ్యారామాంజనేయ ఆలయ ప్రాంగణంలో నిర్మిస్తున్న భారీ పంచముఖ హనుమాన్ విగ్రహ నిర్మాణ పనులను ఆదివారం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ ఠాకూర్ పరిశీలించారు. రాష్ట్రంలోనే అత్యాధునికమైన ఆధ్యాత్మిక కేంద్రంగా గుర్తించబడుతుందని అన్నారు.

క్వార్టర్లు కాదు.. సొంతింటి పథకం కావాలి



మాట్లాడుతున్న తుమ్మల రాజారెడ్డి

గోదావరిఖని: కార్మికులకు క్వార్టర్లు కాదని, సొంతింటి పథకం అమలు చేయాలని సీఐటీయూ అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి అన్నారు. ఆదివారం గోదావరిఖనిలోని యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మూడేళ్ల నుంచి సింగరేణి కార్మికులందరికీ నయాపైసా ఖర్చు లేకుండా కంపెనీకి భారం పడకుండా ప్రభుత్వానికి లాభం చేకూర్చేలా సొంతిల్లు అమలు చేయొచ్చని చెప్తున్నా యాజమాన్యం పట్టించుకోవడం లేదన్నారు. సొంతిల్లు అమలు చేయకుండా రూ.450 కోట్లతో 1,003 క్వాటర్లు నిర్మిస్తామని, అందుకు 50 ఏళ్ల పైబడిన క్వాటర్లు కూల్చేసి వాటి స్థానంలో డబుల్ బెడ్రూం క్వాటర్లు నిర్మిస్తామని అంటోందన్నారు. వెయ్యి క్వార్టర్ల నిర్మాణానికి రూ.450 కోట్లు ఖర్చు అవుతుందని, ఇలా సంస్థ వ్యాప్తంగా 60 ఏళ్ల నాటిన వాటిని కూల్చివేసి కొత్తవి నిర్మిస్తే ఇంకా ఎన్ని కోట్లు అవుతాయని ప్రశ్నించారు. కంపెనీకి, కార్మికుడికి ఎలాంటి భారం పడకుండా ప్రభుత్వానికి పేరు వచ్చేలా కార్మికులందరికీ ఇల్లు వచ్చేలా మా దగ్గర ప్లాన్ ఉందన్నారు. సమావేశంలో నాయకులు రాజమౌళి, మెండె శ్రీనివాస్, సాయిరెడ్డి, గౌస్, సురేష్, రవి, వెంకటేశ్వర్లు, శివరాంరెడ్డి, సత్యనారాయణ, శశికిరణ్, రవి, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కార్యదర్శిగా హరికృష్ణ

పెద్దపల్లిరూరల్: జాతీయ బీసీ సంక్షేమ సంఘం విద్యార్థి విభాగం రాష్ట్ర కార్యదర్శిగా హరికృష్ణయాదవ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ బీసీ విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం తనవంతుగా పోరాడతానని అన్నారు. తన నియామకానికి సహకరించిన ఆర్.కృష్ణయ్య, రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు.

అద్దె కార్లకు ఆషాఢ మొక్కులు



ఈ ఫొటోలో ఉన్న కార్ల లైన్ చూస్తుంటే బండెనక బండి కట్టి పదహారు బండ్లు కట్టి అనే పాట గురుకొస్తుంది కదూ.. అయితే ఇది పాట కోసం మాత్రం కాదు.. ఆషాఢ మాసం వచ్చిందంటే చాలు పోచమ్మ, మైసమ్మలకు మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీ. ప్రతీ ఊరిలో ఈ మాసమంతా గ్రామదేవతల ఆలయాల్లో పూజలు చేస్తుంటారు. ఈ క్రమంలో అద్దె కారు యజమానులంతా కలిసి ఆదివారం మంథని మండలం భట్టుపల్లి సమీపంలోని ఎర్రగుట్ట మీద దారి మైసమ్మకు పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.– మంథనిరూరల్

మల్లన్న సన్నిధిలో భక్తుల రద్దీ



ఆలయంలో శివసత్తుల పూనకాలు



మల్లికార్జునస్వామి దర్శనం కోసం బారులుతీరిన భక్తులు

ఓదెల: ఓదెల మల్లికార్జున స్వామి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచే కాకుండా మహారాష్ట్ర నుంచి భక్తులు అధికంగా వచ్చి దర్శనం చేసుకున్నారు. ఒగ్గుపూజాలతో పట్నాలు వేసి బోనాలు చెల్లించుకున్నారు. శివసత్తుల పూనకాలతో ఆలయంలో నెలకొంది. భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఆలయ ఈవో సదయ్య ఏర్పాట్లు చేశారు. ఓదెల మల్లికార్జున స్వామిని ఆదివారం పెద్దపల్లి ఏసీపీ గజ్జి కృష్ణ కుటుంబసమేతంగా దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో సదయ్యపూర్ణకుంభంతో స్వాగతం పలికి శాలువా, మెమొంటోతో సత్కరించారు.

క్లుప్తంగా

మంత్రి కారు ప్రమాద ఘటనలో ఇద్దరిపై కేసు

- అతివేగం, నిర్లక్ష్యంతో ప్రమాదం జరిగినట్లు గుర్తింపు



ప్రమాదానికి గురైన మంత్రి కారును టోచన్‌లో తరలిస్తున్న పోలీసులు

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం మారుతినగర్ శివారులో మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కారు శనివారం ప్రమాదానికి గురైన ఘటనలో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు మెట్‌పల్లి ఎస్సై కిరణ్‌కుమార్ తెలిపారు. మంత్రి అడ్లూరి మెట్‌పల్లిలో పర్యటన ముగించుకుని ధర్మపురి వెళ్తున్న సమయంలో కోరుట్ల వైపు నుంచి టోచన్‌తో వస్తున్న కారు మంత్రి ప్రయాణిస్తున్న కారు టైరుకు తగలడంతో ప్రమాదం జరిగినట్లు గుర్తించామన్నారు. అతివేగం, నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని, ఘటనకు కారకులైన నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లికి చెందిన పాషా, ఇమ్రాన్‌పై కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య



నాగుల వేణు (ఫైల్)

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం కొడుముంజ గ్రామానికి చెందిన నాగుల వేణు (35) ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాలు. వేణు గతంలో గల్ఫ్ వెళ్లి అప్పుల పాలు కావడంతో తిరిగి వచ్చి కూలి పనులు చేసుకుంటున్నాడు. అప్పులు పెరిగిపోవడంతో మనస్తాపంతో శనివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకున్నాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముకాస రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా హరిశంకర్



కరీంనగర్‌టౌన్: మున్నూరు కాపు సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చల్ల హరిశంకర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లోని జలవిహార్‌లో ఆదివారం జరిగిన కార్యక్రమంలో నియామకపత్రాన్ని మున్నూరు కాపు సంఘం గౌరవ అధ్యక్షుడు, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర చేతుల మీదుగా అందించారు. హరిశంకర్ మాట్లాడుతూ మున్నూరు కాపులు రాజకీయాలకు అతీతంగా, అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు. మున్నూరు కాపులను సంఘటిత పరచి ఒకే తాటిపైకి తీసుకువెళ్తానని తెలిపారు.

ఖర్చు తక్కువ.. పోషకాలు ఎక్కువ

- ప్రకృతి సేద్యం చేసే రైతుల ఎంపిక
- జగిత్యాల జిల్లాలో 2,500 మంది గుర్తింపు
- పంట ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం

జగిత్యాలఅగ్రికల్చర్: వ్యవసాయంలో వస్తున్న మార్పులతో పంటల్లో దిగుబడి పెరిగినప్పటికీ.. రసాయన ఎరువులు, క్రిమిసంహారక మందులు, కలుపు మందులను పంటలపై విచ్చలవిడిగా వాడుతుండటంతో మనుషుల ఆరోగ్యానికి పెను ప్రమాదంగా మారింది. దీంతో రైతులకు రసాయన ఎరువులపై పెట్టే ఖర్చు భారంగా తయారైంది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం ఓ వైపు రైతుల ఖర్చు తగ్గించడంతోపాటు మరోవైపు వినియోగదారులకు మేలైన ఆహారపదార్థాలను అందించేందుకు ప్రకృతి సేద్య పద్ధతులను పాటించాలని అన్ని రాష్ట్రాల వ్యవసాయ శాఖలకు ఆదేశాలు జారీచేసింది. ఈ మేరకు జగిత్యాల జిల్లాలో ప్రకృతి సేద్యాన్ని ప్రోత్సహించేందుకు వ్యవసాయ శాఖ ప్రయత్నాలు ప్రారంభించింది. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం.. ప్రకృతి వ్యవసాయం వైపు రైతుల దృష్టి మరల్చేందుకు శిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలని సంకల్పించింది. ఇప్పటికే ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులతో అవగాహన కార్యక్రమాలతోపాటు వారి తోటలను ప్రదర్శన క్షేత్రాలుగా ఎంపిక చేయనున్నారు. జిల్లాలో ఎంపిక చేసిన రైతులకు పలు విధాలుగా శిక్షణ ఇచ్చేందుకు నిధులు మంజూరు చేస్తోంది. మరోవైపు ప్రకృతి వ్యవసాయం చేసే రైతులను ఎంపిక చేసే పనిలో వ్యవసాయ శాఖ నిమగ్నమైంది.

ప్రకృతి సేద్యానికి ప్రభుత్వం ప్రోత్సాహం

ప్రకృతి సేద్యంతో ఓ వైపు ప్రజల ఆరోగ్యానికి భద్రత ఇవ్వడంతోపాటు మరోవైపు రైతులకు లాభం చేకూరేలా ప్రభుత్వం ప్రకృతి సేద్యం చేసే రైతులకు ప్రోత్సాహం అందించనుంది. ముఖ్యంగా సాగులో రసాయన ఎరువులను ఇబ్బడిముబ్బడిగా వాడుతుండడంతో క్యాన్సర్ వంటి రోగాల బారిన పడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు సాగుభూములు నిర్జీవంగా మారి పనికి రాకుండా పోతున్నాయి. ప్రధానంగా కేంద్ర ప్రభుత్వం సేంద్రియ వ్యవసాయానికి పెద్దపీటే వేస్తూ.. రసాయన అవశేషాలు లేని ఆరోగ్యకర ఉత్పత్తులను ఉత్పత్తి చేస్తూ.. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలని చూస్తోంది. ఈ మేరకు రైతులను ఎంపిక చేసి, వారితో రసాయనాలు లేని సేంద్రియ పంటలను పండించాలని సంకల్పించింది. ఇందుకు గాను రెండేళ్లపాటు జాతీయ ప్రకృతి వ్యవసాయ పథకం అమలు చేసేందుకు జిల్లా స్థాయిలో కార్యాచరణకు సిద్ధమైంది.



ప్రకృతి సేద్యం కోసం ఆవును పెంచుతున్న రైతు రాములు

2500 మంది ఎంపిక

జగిత్యాల జిల్లాలో సేంద్రియ వ్యవసాయం వైపు అడుగులు వేయించేందుకు ఆసక్తి గల 2500 మంది రైతులను ఎంపిక చేయాలని నిర్ణయించారు. జిల్లాలో 72 ఏఈఓ క్లస్టర్లు ఉండగా.. అందులో ప్రాథమికంగా 20 క్లస్టర్ల పరిధిలో ఈ పథకాన్ని ప్రస్తుత ఏడాది నుంచి ప్రారంభించనున్నారు. ప్రతి క్లస్టర్ నుంచి 125 మంది రైతులను ఎంపిక చేస్తారు. వీరికి ఎల్ఎస్ఎఫ్ఐ శాస్త్రవేత్తలు, మాస్టర్ ట్రైనర్లు, శిక్షణ పొందిన సీఆర్‌పీలు ప్రకృతి సేద్యంపై శిక్షణ ఇవ్వనున్నారు. ప్రకృతి సేద్య పద్ధతులకు దేశీయ ఆవులు ప్రధానం కాబట్టి ఆవులు ఉన్న రైతులకు ఈ పథకంలో అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ఆవు పేడ, ఆవు మూత్రంతో జీవామృతం, ఘనామృతం, నీమాస్త్రం తయారుచేసి ఎలాంటి రసాయనాలు, పురుగుమందులు వాడకుండా పంటలు పండించాలన్నది ఈ పథకం ఉద్దేశం.

ప్రకృతి సేద్య స్టాళ్ల ఏర్పాటు

ప్రకృతి సేద్య పద్ధతుల ద్వారా పండించిన పంటలను మార్కెటింగ్ చేసేందుకు ప్రత్యేకంగా జిల్లా స్థాయిలో స్టాళ్లు ఏర్పాటు చేయనున్నారు. ముఖ్యంగా కూరగాయలు, భోజనానికి ఉపయోగించే సన్నరకం వరి పంట సాగు చేసే రైతులను తొలుత ఈ పథకంలోకి తీసుకురానున్నారు. వారు పండించిన ఉత్పత్తులకు మార్కెటింగ్ ఉంటే ఇతర రైతులు కూడా సేంద్రియ పద్ధతులను అనుసరించే అవకాశం ఉంటుందని వ్యవసాయ శాఖ భావిస్తోంది.

ప్రకృతి వ్యవసాయం చేస్తున్నాను



కొన్నేళ్లుగా ప్రకృతి వ్యవసాయ పద్ధతులను ఆచరించడంతోపాటు ఈ పద్ధతిలో ఆసక్తి ఉన్న రైతులకు పలు దఫాలుగా శిక్షణ ఇచ్చాను. మామిడి, వరి పంటల్లో ప్రకృతి వ్యవసాయ పద్ధతులు ఆచరిస్తున్నాను. మంచి ఫలితాలు కన్పిస్తున్నాయి.

– మిట్టపెల్లి రాములు, తుంగూర్

రైతులను ఎంపిక చేస్తున్నాం



సేంద్రియ వ్యవసాయ పథకం కోసం రైతులను ఎంపిక చేసే ప్రక్రియ ప్రారంభమైంది. ఉత్పత్తుల అమ్మకాలకు మార్కెటింగ్ సదుపాయం కల్పించేందుకు ప్రయత్నిస్తున్నాం. రసాయన ఎరువులను తగ్గించి, సహజ ఉత్పత్తులు అందించాలన్నది లక్ష్యం.

– భాస్కర్, వ్యవసాయ శాఖ అధికారి, జగిత్యాల

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి



వెంకటి మృతదేహం

చందుర్తి(వేములవాడ): ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ వృద్ధుడు ఆదివారం మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు. మండలంలోని ఆశిరెడ్డిపల్లికి చెందిన నేరెళ్ల వెంకటి(72) ఈనెల 11న తన ఇంటి ముందర కూర్చోగా.. అదే మండలం నర్సింగాపూర్‌కు చెందిన పూడూరి భరత్ బైక్‌తో ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో వృద్ధుడు రెండు కాళ్లు, చేతు విరగ్గా, తలకు బలమైన గాయమైంది. 15 రోజులపాటు కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందాడు. రెండు రోజుల క్రితం ఇంటికి తీసుకొచ్చారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఆదివారం తిరిగి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ వృద్ధుడు మృతిచెందాడు. మృతునికి భార్య సత్తవ్వ, ఇద్దరు కుమారులు ఉన్నారు. కాగా బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు చందుర్తి ఎస్సై రమేశ్ తెలిపారు.

కోరుట్లలో ఒకరికి కత్తిపోట్లు

కోరుట్ల: కోరుట్లలోని రవీంద్రరోడ్‌లో ఆదివారం సాయంత్రం ఓ వ్యక్తి కత్తిపోట్లకు గురయ్యాడు. దీంతో బాధితుడిని కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రికి.. అక్కడి నుంచి కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పట్టణానికి చెందిన ఇట్యాల సత్యనారాయణ (45) పోచమ్మ బోనాల సందర్భంగా రవీంద్రరోడ్‌లోని తమ సంఘం భవనం వద్ద ఉండగా ఇల్లుటపు గంగనర్సయ్య(40) అనే వ్యక్తి అకస్మాత్తుగా వచ్చి కత్తితో కడుపులో పొడిచినట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. పాత కక్షలు, గొడవలు కత్తిపోట్లకు కారణమని పేర్కొన్నారు.

రూ.3కోట్ల కారు.. ఊడిపోయిన టైరు

- మంత్రి కారుకు ప్రమాదంపై చర్చ
- భద్రతపై సందేహాలు..?

కోరుట్ల: ఆ కారు ఖరీదు ఇంచుమించు రూ.3 కోట్లు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం ఉన్నట్లు పేరున్న కారు. ఏదైనా ప్రమాదం జరిగి.. కారు పల్టీలు కొట్టినా పది ఏయిర్ బ్యాగులు తెరుచుకుని భద్రత విషయంలో ఏ మాత్రం బెదిరిపోవాల్సిన అవసరం లేదన్న ప్రచారం ఉంది. దీనికితోడు బులెట్ ప్రూఫ్. ఇన్ని ప్రత్యేకతలు ఉన్న ఖరీదైన కారు టైరు చిన్నపాటి ప్రమాదంలో ఎలా ఊడిపోయిందని స్థానికంగా చర్చ నడుస్తోంది. కారులో ఉన్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు అదృష్టవశాత్తు ప్రమాదం జరగలేదు. అదే సమయంలో రూ.కోట్లు వెచ్చించి కొనుగోలు చేసిన కారు భద్రతపై మాత్రం లెక్కలేని సందేహాలు వస్తున్నాయి.

అసలేం జరిగింది..?

శనివారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు మంత్రి అడ్లూరి వివిధ కార్యక్రమాల్లో పాల్గొనడానికి కోరుట్ల వచ్చారు. సాయంత్రం ఏడు గంటల సమయంలో మెట్‌పల్లి నుంచి తిరిగి ధర్మపురి వెళ్లేందుకు తన కారులో బయలుదేరారు. 15 నిమిషాల్లో కారు మెట్‌పల్లిదాటి మారుతీనగర్ సమీపానికి చేరుకుంది. అదే సమయంలో దెబ్బతిన్న ఓ కారును కోరుట్లలోని మెకానిక్ షెడ్ నుంచి నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లికి తీసుకువెళ్తున్న టోచన్ వాహనం ఎదురుగా వచ్చింది. రెండు వాహనాలు ఎదురెదురుగా చిన్నగా తగిలినట్లు తెలుస్తోంది. ఈ ప్రమాదంలో అకస్మాత్తుగా మంత్రి కారు టైర్ ఊడిపోయింది. కారు టైర్ ఊడిపోవడం మినహా మంత్రి కారుకు ఎక్కడా ఎలాంటి గీత పడకపోవడం గమనార్హం. ఈ ప్రమాదంలో మంత్రి అడ్లూరి క్షేమంగా బయటపడగా.. టోచన్ వాహనంతో కారును తెస్తున్న వారిలో ఇమ్రాన్ అనే వ్యక్తికి స్వల్పగాయాలయ్యాయి. వెంటనే మెట్‌పల్లి పోలీసులు వచ్చి రెండు వాహనాలను అక్కడి నుంచి తరలించి కేసు నమోదు చేశారు.



టైర్ ఊడిపోయి ప్రమాదానికి గురైన మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కారు

భద్రత సంగతి దేవుడెరుగు..

మంత్రి కారులో ఉన్న ఆధునిక టెక్నాలజీ ప్రకారం ఏ పరికరంలోనైనా విడిభాగాలను బిగించే చిన్న చిన్న నట్లు, స్క్రూలు, ఇతరత్రా పరికరాల్లో కొంచెం తేడా వచ్చినా.. లూజు అయినట్లు ఉన్నా ప్రమాద సూచికలు ఇస్తుందని సమాచారం. శనివారం రాత్రి జరిగిన చిన్నపాటి ప్రమాదానికే ఫోర్ వీల్ డ్రైవ్ ఆటోమేటిక్ టైర్ ప్రెజర్ మానిటరింగ్ సిస్టం ఉన్న మంత్రి కారు టైరు ఎలా ఊడిపోయిందన్న అనుమానాలు వస్తున్నాయి. ఒకవేళ కారు టైర్ ముందుగానే కాస్త లూజ్ అయి ఉంటే దానికి సంబంధించిన ప్రమాద సూచికలు ఎందుకు రాలేదన్న సందేహాలు ఉన్నాయి. ఒకవేళ ప్రమాద సంకేతాలు వచ్చినా డ్రైవర్ సరిగా దృష్టి పెట్టలేదా..? అన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ముందస్తుగా ప్రమాదాన్ని నివారించే టెక్నాలజీ వ్యవస్థ సైతం ఈ కారులో ఉంది. అంతే కాకుండా ఈ వాహనం భద్రతా రేటింగ్ 5 స్టార్ కావడం గమనార్హం.

అవే కార్లు...

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం మంత్రుల కోసం ఇదే రకం 22 కార్లను కొనుగోలు చేసిన విషయం తెలిసిందే. కొత్త ప్రభుత్వ హయాంలో రాష్ట్ర ఖజానా లోటు ఉన్నా ఇంత లగ్జరీ కార్లు ఎలా కొనుగోలు చేశారన్న విమర్శలు వచ్చాయి. ప్రస్తుతం అవే కార్లు కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రులకు కేటాయిస్తున్నారు. శనివారం మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌కు కేటాయించిన కారు కూడా అదే కావడం గమనార్హం.

పోయింది ఎక్కువ.. రికవరీ తక్కువ



ఇటీవల కమిషనరేట్‌లో రికవరీ చేసిన సెల్‌ఫోన్లతో పోలీస్ అధికారులు

- సెల్‌ఫోన్ రికవరీలో వెనుకంజ
- కమిషనరేట్‌లో పోయింది 6,683
- రికవరీ అయిన 2,020 సెల్ ఫోన్లు

గోదావరిఖని: పోయింది ఎక్కువ.. రికవరీ తక్కువ.. ఇదీ రామగుండం పోలీస్‌కమిషనరేట్‌లో సెల్‌ఫోన్ రికవరీ పరిస్థితి. వారసంతలు, బస్‌స్టేషన్లు, రద్దీప్రాంతాల్లో సెల్‌ఫోన్ ఎక్కువగా చోరీకి గురవుతున్నాయి. సెల్‌ఫోన్ పోగొట్టుకున్న బాధితులు సంబందిత సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఈఐఆర్) పోర్టల్‌లో నమోదు చేయడంతో పాటు సంబందిత పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేస్తున్నారు. సెల్‌ఫోన్ చోరీ చేసిన దొంగలు మరో అడుగు ముందుకేసి ఐఎంఈఐ నంబర్ తొలగించి వినియోగిస్తుండటంతో బాధితులకు పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లు తిరిగి దక్కడం లేదు.

మొబైల్ ట్రాక్ ద్వారా రికవరీ

పోయిన సెల్‌ఫోన్ ఒరిజినల్ బిల్లుల ద్వారా ఐఎంఈఐ నంబర్‌తో ట్రాక్ చేస్తున్నారు. సెల్‌ఫోన్ కాల్స్‌పై ట్రాక్ రికార్డింగ్ ఉంచడం ద్వారా గుర్తిస్తున్నారు. అయితే కొందరు సిమ్ వేసి ఆన్‌చేయకుండా వీడియోగేమ్‌లు, ఇతర పనులకు వినియోగిస్తుండటంతో పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌లు రికవరీ కావడం లేదు.

దొరికేది తక్కువే..

సీఈఐఆర్ పోర్టల్ రంగప్రవేశంలో సెల్‌ఫోన్ చోరీలకు అడ్డుకట్టపడింది. అయినప్పటికీ రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో 6,683 మొబైల్ ఫోన్లు చోరీకి గురయ్యాయి. వీటిలో 40శాతం మాత్రమే రికవరీ అయ్యాయి. పోగొట్టుకున్న సెల్‌ఫోన్లలో 2020 సెల్ ఫోన్ మాత్రమే రికవరీ అయ్యాయి.

ప్రతీ పోలీస్‌స్టేషన్‌లో ప్రత్యేక విభాగం

పోయిన సెల్‌పోన్ల రికవరీ కోసం రామగుండం పోలీస్‌కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలీస్‌స్టేషన్లలో ప్రత్యేక విభాగాన్ని రామగుండం సీపీ అంబర్ కిశోర్‌ఝా ఏర్పాటు చేశారు. ఎవరైన సెల్‌పోన్ కోల్పోతే వెంటనే సీఈఐఎంఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు సంబందిత పోలీసుస్టేషన్‌లో సంప్రదించాలని కోరుతున్నారు. వీటిపై నిఘా కోసం సీసీఎస్, ఐటీ సెల్ విభాగాలు పనిచేస్తున్నాయి.

అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం

గోదావరిఖనిటౌన్: స్థానిక శ్రీనగర్‌కాలనీలోని వైభవ టవర్స్ అపార్ట్‌మెంట్‌లో ఆదివారం ఉదయం 8గంటలకు షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం జరిగింది. స్పందించిన ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేశారు. అపార్ట్‌మెంట్ నాలుగో అంతస్తులోని సింగరేణి ఉద్యోగి బొంపెల్లి యాదగిరి ఇంట్లో కరెంట్ షార్ట్ సర్క్యూట్‌తో మంటలు అంటుకొని బెడ్‌రూం, హాల్ పూర్తిగా దగ్ధమైంది. గదులు పొగతో నిండిపోవడంతో యాదగిరి ఆయన భార్య రమాదేవి పొగ పీల్చి అస్వస్థతకు గురయ్యారు. స్థానికులు దంపతులను ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అగ్నిప్రమాదంలో సుమారు రూ.2లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు గోదావరిఖని ఫైర్ ఆఫీసర్ పి.లక్ష్మీనారాయణ తెలిపారు.

వృద్ధురాలి ఆత్మహత్య

వేములవాడరూరల్: మానసిక స్థితి, ఆరోగ్యం సరిగా లేకపోవడంతో పండుగ బక్కవ్వ (65) అనే వృద్ధురాలు ఆదివారం ఆత్మహత్య చేసుకుంది. గ్రామస్తులు, పోలీసులు తెలిపిన వివరాలు. వేములవాడరూరల్ మండలం మర్రిపల్లికి చెందిన బక్కవ్వ మానసికస్థితి సరిగా లేదు. ఇంటి ఆవరణలోనే చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి భర్త నర్సయ్య, చిన్నకుమారుడు చింటు గతంలోనే మృతి చెందారు. మృతురాలికి పెద్ద కుమారుడు శ్రీనివాస్ ఉన్నారు. వృద్ధురాలి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వేములవాడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గురుకులం విద్యార్థులకు పురుగుల అన్నం

వెల్గటూర్ : వెల్గటూర్ మండలం స్తంభంపల్లిలోని బీసీ గురుకుల హాస్టల్ విద్యార్థులకు ఆదివారం పురుగులు పట్టిన భోజనం అందించడం కలకలం సృష్టించింది. పాఠశాలకు సందర్శనకు వెళ్లిన ఓ విద్యార్థి తండ్రి పురుగుల భోజనం చూడడంతో విషయం బయటకు తెలిసింది. గురుకులాల్లో తరచుగా నాసిరకం భోజనంతో విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్న సందర్భంలో ఈ సంఘటన చోటుచేసుకోవడం చర్చనీయాంశమైంది. ఈ విషయమై ప్రిన్సిపాల్‌ను వివరణ కోరగా.. ప్రతీరోజు బియ్యం శుభ్రం చేసిన తర్వాతే వండుతామని, ఆదివారం కావడంతో అధ్యాపకులు అందరూ సెలవులో ఉన్నారని, అందుకే పర్యవేక్షించలేదని, మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసుకుంటానని తెలిపారు. నాసిరకం బియ్యం పాఠశాలలకు సరఫరా చేస్తున్న కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.



విద్యార్థులకు అందించిన భోజనంలో పురుగులు

చికిత్స పొందుతూ ఒకరు మృతి

గన్నేరువరం: మండలంలోని గునుకులకొండాపూర్ గ్రామానికి చెందిన రామగోని వీరవ్వ(60) చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందినట్లు ఎస్సై నరేందర్‌రెడ్డి తెలిపారు. వీరవ్వ కొద్దికాలంగా అనారోగ్య సమస్యలతో బాధపడుతోంది. సమస్య తీవ్రంకావడంతో, భరించలేక ఈ నెల 28వ తేదీన పురుగుల మందు తాగింది. బంధువులు కరీంనగర్‌లోని ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి తీవ్రంగా ఉండటంతో వరంగల్‌లోని ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వీరవ్వ కూతురు గౌతమి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

హోమియోను మించిన వైద్యం లేదు

- స్వీయ అనుభవాన్ని వివరించిన కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల
- కరీంనగర్‌లో హోమియో వైద్యుల ఐదో రాష్ట్రస్థాయి సైంటిఫిక్ సెమినార్

కరీంనగర్‌టౌన్: వైద్యరంగంలో హోమియోను మించిన చికిత్స లేదని కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ అన్నారు. కరీంనగర్‌లోని పద్మనగర్‌లో 5వ రాష్ట్రస్థాయి ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హోమియోపతి ఫిజీషియన్స్ సైంటిఫిక్ సెమినార్‌ను ఆదివారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సెమినార్లో కరీంనగర్‌కు చెందిన ప్రముఖ హోమియో వైద్యుడు కొడిత్యాల శ్రీనివాస్ లైవ్‌లో ఫిమేల్ ఇన్ఫెర్టిలిటీపై, డాక్టర్ ప్రవీణ్ కుమార్ పాతలాజికల్ ప్రిస్క్రిప్షన్‌పై, డాక్టర్ గణేశ్ ఆచారి కార్డియోమైపోతిపై, డాక్టర్ హీరాలాల్ అగర్వాల్ రేనల్ వ్యాధులపై, సైంటిఫిక్ సెమినార్ నిర్వహించారు. ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ ఇప్పటివరకు తన చేతుల మీదుగా వందల హాస్పిటళ్లు ప్రారంభించానని, హోమియో వైద్య సదస్సుకు రావడం ఇదే ప్రథమమన్నారు. ఈ సదస్సుకు తను ఇష్టంతో వచ్చానని అన్నారు. ఈ సందర్భంగా తన స్వీయ అనుభవాన్ని వివరించారు. మానేరు రివర్ ఫ్రంట్ స్టడీ కోసం సియోల్‌కు వెళ్లగానే తనకు విపరీతమైన దగ్గు వచ్చిందన్నారు. ఏ ఆసుపత్రికి వెళ్లినా తగ్గలేదని, ఒక మంత్రి సూచన మేరకు హోమియో వాడిన వారం రోజుల్లోనే పూర్తి రిలీఫ్ వచ్చిందని తెలిపారు. హోమియో వైద్యుల సంఘ భవన స్థలానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం 2025–27 సంవత్సరానికి గానూ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులుగా డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ హరికృష్ణను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా గుజరాత్‌కు చెందిన డాక్టర్ నిశికత్ తాపే వ్యవహరించారు. కరీంనగర్ యూనిట్ ప్రెసిడెంట్‌గా డాక్టర్ కొడిత్యాల శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. హోమియోపతి వైద్యుల జాతీయ అధ్యక్షుడు డాక్టర్ శివమూర్తి, చీఫ్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎంఏ.రావు, డాక్టర్ ఎంఎస్ రాజు, డాక్టర్లు దీపక్ బాబు, ఎస్ఎస్.రెడ్డి, దయాకర్, దినకర్, రవికుమార్, రవీంద్రచారి, హప్సాన, కృష్ణకాంత్, 300మంది వైద్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంగుల కమలాకర్

చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడి మృతి



కనకయ్య మృతదేహం

తిమ్మాపూర్: మండలంలోని ఎల్ఎండీ డ్యాంలో చేపలు పట్టేందుకు వెళ్లి మత్స్యకారుడు మృతి చెందిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం మానకొండూర్ మండలం ముంజంపల్లి గ్రామానికి చెందిన పిల్లి కనుకయ్య(61) రోజూ మాదిరిగానే చేపలు పట్టేందుకు ఈనెల 28న ఎల్ఎండీలోని రిజర్వాయర్‌కు వెళ్లాడు. చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు తెప్పపై నుంచి పడి నీళ్లలో పడి మునిగిపోయాడు. నరేడ్ల రవి అనేవ్యక్తి కనుకయ్య కుటుంబ సభ్యులకు, పోలీసులు సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని వెలికి తీశారు. మృతుడి కుమారుడు పిల్లి సాగర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ గౌడ్ తెలిపారు.

మత్స్యకారుడి గల్లంతు



గువ్వ రవి(ఫైల్)

గన్నేరువరం: మండలంలోని మైలారం గ్రామానికి చెందిన గువ్వ రవి(43) చేపలవేటకు వెళ్లి గల్లంతయ్యాడు. గ్రామస్తులు కథనం మేరకు.. గువ్వ రవి చేపలు పడుతూ.. కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గ్రామ సమీపంలోని లోయర్ మానేరు డ్యాం బ్యాక్ వాటర్‌లో ఆదివారం చేపల వేటకు వెళ్లాడు. తెప్పసాయంతో డ్యాంలో చేపలు పడుతున్న క్రమంలో ఒక్కసారిగా వచ్చిన తీవ్రమైన గాలులకు తెప్ప తిరగబడటంతో నీటిలో పడి గల్లంతయ్యాడు. ఇది గమనించిన తోటి మత్స్యకారులు తెప్పలపై నీటిలో వెళ్లి గాలింపు చేపట్టగా ఆచూకీ లభ్యం కాలేదు. రవికి భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. సంఘటన స్థలానికి పోలీసులు పరిశీలించారు.

రాజన్నకు మొక్కులు





వేములవాడ: రాజన్నను ఆదివారం 25వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ధర్మగుండంలో స్నానాలు చేసిన భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. వర్షాలు కురవాలని, పాడిపంటలు బాగుండాలని మొక్కుకున్నారు. భక్తుల ఏర్పాట్లను ఆలయ అధికారులు పరిశీలించారు.